క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌కు చిత్రపటం బహూకరణ



చిత్రపటం బహూకరిస్తున్న తిరుపతిరెడ్డి

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం సీఎం కేసీఆర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి సీఎంను కలిసి చిత్రపటం బహూకరించారు. సీఎం కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో పెన్సిల్‌తో వేసిన చిత్రపటం బహూకరించామని, చిత్రపటాన్ని చూసి సీఎం సంతోషం వ్యక్తం చేశారని తిరుపతిరెడ్డి తెలిపారు.

ఇంగ్లీష్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో బుధవారం ఇంగ్లీష్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో వారి ప్రతిభను చూపించారు. ప్రిన్సిపాల్ రజితారావు, డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ అశ్విని

రాయికల్: మండలంలోని దావన్‌పెల్లి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం జెడ్పీటీసీ జాదవ్ అశ్విని భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యమున, ఉపసర్పంచ్ భిక్యానాయక్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలి



వస్తువులు అందజేస్తున్న అధికారులు

మెట్‌పల్లి: బ్యాంకు రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఫణి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు మండలంలోని జగ్గాసాగర్‌లో బుధవారం రుణమేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘాలకు రూ.2కోట్ల రుణాలకు సంబంధించిన మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం ఆర్ఎంతో పాటు ఇతర సిబ్బందిని మహిళలు సన్మానించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి బ్యాంకు తరఫున ప్యూరిఫైడ్ వాటర్ మిషన్, టీవీ, ట్యాబ్, ఆట వస్తువులను అందజేశారు. సర్పంచ్ బద్దం సుగుణ, మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ బోగ కిరణ్, ఐకేపీ ఏపీఎం విమోచన ఉన్నారు.

శిథిలావస్థలో ఉన్న భవనం కూల్చివేత

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థలో ఉండటంతో బుధవారం అధికారులు కూల్చివేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిథిలావస్థలో ఉన్న గ్రామపంచాయతీ భవనం పూర్తిగా కూల్చివేసి, కొత్త భవనం నిర్మించాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు. కూల్చివేత పనులను ఎంపీవో గంగాధర్, సర్పంచ్ భైర హేమలత, ఎంపీటీసీ బొడ్డు బాలు, కార్యదర్శి మోహన్ పరిశీలించారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో 19న ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని బుధవారం వర్షకొండలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లింబాద్రి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జెరి ప్రకాష్, నాయకులు బాయి లింగరెడ్డి, కిశోర్, గోపి, నర్సయ్య, సంజీవ్, అజయ్, రాజేశ్ రక్షక్, గంగాధర్, ప్రశాంత్, వెంకటేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పుష్కరకాలమైనా.. పూర్తికాని భవనం

- 2011లో స్త్రీశక్తి భవన నిర్మాణానికి రూ.22లక్షలు మంజూరు
- సమావేశాలు, ఆర్థిక లావాదేవీల నిర్వహణకు ఇబ్బంది
- మండల పరిషత్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ కార్యాలయం



స్త్రీశక్తి భవనం లోపల హాల్

సారంగాపూర్: స్త్రీశక్తి భవన నిర్మాణం ప్రారంభించి పుష్కరకాలం దాటినా నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. దీంతో మండల గ్రామైక్య సంఘాలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కార్యాలయాల నిర్వహణ అధికారులకు ఇబ్బందిగా మారింది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం 2010-11లో సారంగాపూర్ మండల కేంద్రంలో స్త్రీశక్తి భవన నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధుల కింద రూ.22 లక్షలు విడుదల చేసింది. పనులు ప్రారంభించిన దాదాపు 12 ఏళ్లు (పుష్కరకాలం) దాటినా ఇంకా పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి.

547 స్వశక్తి సంఘాలు..

సారంగాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక స్త్రీశక్తి భవన నిర్మాణం చేపట్టారు. ఇందులో మహిళా సంఘాలు తమ ఆర్థిక కార్యక్రమాలు నిర్వహించుకోవడంతో పాటు, మండలస్థాయిలో సమావేశాలు జరుపుకోవడం, మహిళలకు ఆర్థికంగా ఎదుగుదల కోసం ఏర్పాటు చేసుకునే వ్యాపారాలపై శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఈ భవనంలో గదులు నిర్మించారు. మండలంలో మొత్తం 547 స్వశక్తి సంఘాలు, ఇందులో 6379 మహిళలు సభ్యులుగా ఉండగా, 18 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీరందరికీ భవన నిర్మాణం జరిగితే సౌకర్యంగా ఉంటుంది.

మండల పరిషత్ కార్యాలయంలో.. ఉపాధిహామీ కార్యాలయం

మండలంలో మొత్తం 18 గ్రామాలు ఉండగా, 6864 జాబ్‌కార్డుల కింద కూలీలు పనిచేసుకుంటున్నారు. ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, ఉపాధిహామీ పనుల కార్యాలయం ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంలో ఓ గదిలో కొనసాగుతోంది. ఒకే గదిలో ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది ఒక్క గదిలోనే ఉండాల్సి రావడంతో చాలా ఏళ్లుగా ఉపాధిహామీ సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఇప్పటి వరకు రూ.40లక్షలు ఖర్చు..

స్త్రీశక్తిభవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటి వరకు అంచెలంచులుగా రూ.40లక్షల వరకు ఖర్చు చేసింది. భవనంలో విద్యుత్ లైట్ల ఫిటింగ్, కింద ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలను బిగించడం, కలర్స్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాగా పనులు నిర్వహించిన కాంట్రాక్టర్‌కు పూర్తి బిల్లులు రాకపోవడంతోనే పనులు నిర్వహించడం లేదని సమాచారం.

భవన నిర్మాణం పూర్తి చేయాలి



భవనం పూర్తయితే సమావేశాలు, ఆర్థికలావాదేవీలు నిర్వహించడం సులువుగా ఉంటుంది. సారంగాపూర్ సెర్ప్ కార్యాలయంలో కార్యక్రమాల నిర్వహణ సమస్యగా మారింది. – ముంతాజ్‌బేగం, మండల సమాఖ్య అధ్యక్షురాలు

చర్యలు తీసుకుంటున్నాం



పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. మే చివరినాటికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఈ దిశగా త్వరలోనే పనులు పునఃప్రారంభిస్తాం. – భూపతి, ఏఈ, పీఆర్

అటెన్షన్ ప్లీజ్



నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో వాటర్‌ప్లాంట్ (శుద్ధజలకేంద్రం)సాంకేతిక సమస్యలు ఏర్పడి దాదాపు 6 నెలల క్రితం మూతపడింది. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో తప్పనిసరిగా ప్రజలు తాగడానికి శుద్ధజలం అందించాల్సి ఉంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వాటర్‌ప్లాంట్‌కు తక్షణమే మరమ్మతు చేసి గ్రామస్తులకు శుద్ధజలం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి పేరు : మల్లారెడ్డి, ఎంపీడీవో
ఫోన్ నంబర్ : 98491 94556

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి



కోరుట్లటౌన్: కంటి వెలుగు వైద్యశిబిరం



ధర్మపురి: పరీక్షలకు హాజరైన ప్రజలు

కోరుట్లటౌన్: కంటి వెలుగు వైద్యశిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 15వ వార్డు కౌన్సిలర్ ఆడెపు కమల కోరారు. ఈ మేరకు పట్టణంలోని 15వ వార్డులో బుధవారం కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు.

కార్యక్రమానికి విశేష స్పందన

ధర్మపురి: కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ధర్మపురి మండలంలోని ధర్మపురితో పాటు రాయపట్నంలో, అదేవిధంగా బుగ్గారం మండలంలోని శెకల్లలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మూడు గ్రామాల్లో మూడు వైద్య బృందాలతో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ధర్మపురిలోని 1, 2, 3, 4, 5, 7 వార్డుల్లో కంటి వెలుగు కార్యక్రమం పూర్తి చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్, డాక్టర్ అవంతి, రాంబాబు, హెచ్‌ఈవో సతీశ్ ఉన్నారు.

వైభవంగా సంత్ సేవాలాల్ జయంతి



కథలాపూర్: ఉత్సవాల్లో నాయకులు



పెగడపల్లి: ఏడుమోటలపల్లి తండాలో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

కథలాపూర్: మండలంలోని కలిగోటలో గిరిజనుల ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు బుధవారం నిర్వహించారు. జెడ్పీ మాజీచైర్‌పర్సన్ తుల ఉమ, నాయకులు ప్రకాశ్, రాంసింగ్, మంగ్యానాయక్, రాంరెడ్డి నాయక్, రాందాస్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

పెగడపల్లిలో..

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లి, మద్దులపల్లి, రాజరాంపల్లి తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచులు రవినాయక్, అనూష, సత్తమ్మ, ఎంపీటీసీలు రవి, అంజయ్య, స్వాతి, కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..



మల్లాపూర్: సిరిపూర్‌లో ప్రత్యేక పూజలు

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాజశ్రీనివాస్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్ భూక్య గోవింద్‌నాయక్, ఎంపీటీసీ ఏనుగు రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రంజిత్, గిరిజన పెద్దలు బదావత్ రాంనాయక్, సునావత్ గోవింద్, రాజునాయక్, దేవదాస్‌నాయక్ , భీంరాజునాయక్, తిరుపతినాయక్, భూక్య ధర్మరాజు, సభావత్ మల్లేశ్, భూక్య అనిల్, లింబానాయక్, గంగచంద్, శేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

రాయికల్‌లో..



రాయికల్: పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయికల్: మండలంలోని దావన్‌పల్లిలో మహరాజ్ సేవాలాల్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా సంప్రదాయబద్ధంగా బోగుబండారు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు భూక్య యమున, బంజారా నాయకులు తిరుపతినాయక్, సురేందర్‌నాయక్, బీజేపీ నాయకులు మాదం మల్లేశ్, గంగాధర్ నాయక్, తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్పీకర్ దివాకర్

ధర్మపురి: విద్యార్థులు తమ కేరీర్‌కు అనుగుణంగా మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని ధర్మపురికి చెందిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సంగనభట్ల దివాకర్ సూచించారు. ఈ మేరకు ధర్మపురికి చెందిన పెండ్యాల బాలకృష్ణ శర్మ మనుమడి జన్మదినం సందర్భంగా స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో బుధవారం మండల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పోటీ పరీక్షల్లో విద్యార్థులు చదివే విధానం, నడవడి క్రమశిక్షణ, భవిష్యత్‌ను ఎలా తీర్చిదిద్దుకోవాలో తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మోటివేషన్ స్పీకర్ దివాకర్‌ను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ, కార్యదర్శి పైడి మారుతి, డీసీ జక్కు రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన చీర్నేని రాజు (25) అప్పుల బాధ భరించలేక బుధవారం సాయంత్రం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఆత్మహత్య చేసుకోవడానికి అరగంట ముందు సెల్ఫీ వీడియో తీసి తన చావుకు ఎవరూ కారణం కాదు, తాను మక్క చేను వద్ద ఉన్న వ్యవసాయ బావిలో దూకి చనిపోతున్నానని పేర్కొంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. బీర్‌పూర్ ఏఎస్సై రవీందర్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్‌కు చెందిన చీర్నేని శ్రీనివాస్–పుష్ప దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు చీర్నేని రాజు రెండున్నరేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. 15రోజుల క్రితం దుబాయ్ నుంచి ఇంటికి వచ్చాడు. దుబాయ్ వెళ్లడానికి చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యాడు. కాగా బుధవారం సాయంత్రం గ్రామ శివారుల్లోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న వీడియోను పలువురు స్నేహితులు చూసి తల్లితండ్రులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, తల్లితండ్రులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. గంట తర్వాత రాజు మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

శ్రీకనక సోమేశ్వరస్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు

మల్లాపూర్: మహాశివరాత్రి, శ్రీ కనకసోమేశ్వర స్వామి జాతర మహోత్సవాలలో భాగంగా మల్లాపూర్ మండల కేంద్రంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కనక సోమేశ్వరస్వామి శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించారు. శోభాయాత్రలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సంగ రాజన్న, సోమేశ్వర దీక్షదారులు క్యాతం సురేశ్‌రెడ్డి, బండారి రమేశ్, బొక్కల నాగరాజు, నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, వెల్మల రాజరెడ్డి, కొప్పెల రవి, ముష్కరి రమేశ్, కొంపల్లి రాకేశ్, ఎల్ల చిన్నదేవయ్య, గంగాధర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సంగ రాజన్న మాట్లాడుతూ 16 నుంచి 20 వరకు శ్రీ కనకసోమేశ్వర స్వామి జాతర మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



విరాళాలు అందజేస్తున్న దాతలు

మల్లాపూర్: శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ తోట తిరుపతి కోరారు. ఈ మేరకు బుధవారం మల్లాపూర్ మండలంలోని వెంకట్రావ్‌పేట శివారులో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్‌గా తోట తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు 63మంది దాతలు రూ.5వేల చొప్పున రూ.3,15,000 విరాళంగా అందించారు. ఆలయ అర్చకులు గోవిందుల విజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ జోగుల మమత–రాజేశ్, ఎంపీటీసీ తోట సుజాత–శ్రీనివాస్, ఉపసర్పంచ్ కొడిమ్యాల రవి, వీడీసీ కోశాధికారి బోగ వెంకటి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రమేశ్, లక్ష్మీనారాయణ, దశరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, రమణయ్య, లక్ష్మణ్‌రెడ్డి, చిన్నవెంకయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం



పోలీస్‌స్టేషన్ ఎదుట నాయకుల నిరసన



రాయికల్ పోలీస్ స్టేషన్‌లో నాయకులు

ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ కొండగట్టు పర్యటనను పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలో మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు, రైతు సంఘం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని పార్టీ మండల అధ్యక్షుడు జకరయ్య, రైతు సంఘం నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పోలీసులు అర్ధరాత్రి వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడంతో బుధవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

రైతు సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్

రాయికల్: కొండగట్టులో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి రైతు సంఘం మండల నాయకులు క్యాతం సాయిరెడ్డి, మేక్కొండ రాంరెడ్డి, బీజేపీ ఎంపీటీసీ రాజనాల మధుకుమార్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

చలో కథలాపూర్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: ఈనెల 19న కథలాపూర్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఛలో కథలాపూర్' కార్యక్రమం పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కథలాపూర్‌లో విలేజ్ లర్నింగ్, ఫిట్‌నెస్ సెంటర్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాల నుంచి విద్యావేత్తలు, విద్యాభిమానులు, యువకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. బీఎస్పీ మండల కన్వీనర్ తెడ్డు శేఖర్, నాయకులు బాలె నీలకంఠం, చాకలి వెంకటేశ్, బెజగం నరేందర్, సాయి, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆కాంగ్రెస్ గ్రామశాఖ కార్యవర్గం

రాయికల్: మండలంలోని కొత్తపేట కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా అల్లకొండ చంద్ర సాయలు, యూత్ అధ్యక్షుడిగా మందుల అంజన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మల్లేశం, భూమయ్య, కోశాధికారిగా గంగారాజం బుధవారం ఎన్నికయ్యారు.


◆బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గొల్లపల్లి: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చిలుకమర్రి శ్రీహరి బ్లడ్ సర్క్యులేషన్ నిలిచిపోవడంతో కాలు కోల్పోయాడు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న పార్వతి పరమేశ్వర సేవా సమితి సభ్యులు శ్రీహరికి రూ.7,116 అందజేశారు.

◆వస్తువుల విక్రయానికి ముగిసిన వేలం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలోని కొండపై వెలసిన శ్రీగుట్ట రాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే జాతర ఉత్సవాల్లో స్వామివారి ఆలయం వద్ద వివిధ వస్తువుల కోసం నిర్వహించిన వేలం బుధవారం పూర్తయింది. టెంకాయలు అమ్ముకోవడానికి రూ.62వేలు, లడ్డు పులిహోర ప్రసాదాల అమ్మకానికి రూ.10వేలు, గండదీపంలో నూనెకు రూ.2వేలు, కొబ్బరిచిప్పల సేకరణకు రూ.4వేలతో పాటదారులు హక్కులను దక్కించుకున్నారు. సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఆలయ చైర్మన్ కొల్లూరి ప్రభాకర్, మండల కోఆప్షన్ సభ్యురాలు ఎండీ.బీబా, ఉపసర్పంచ్ పూడూరి రమేశ్ ఉన్నారు.

'తప్పుడు విధానాలను ఎండగట్టాలి'



కార్నర్ మీటింగ్‌లో నాయకులు

సారంగాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలను ఎండగడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేలా కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, రైతు ఐక్యవేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు పన్నాల తిరుపతిరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లె గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో పార్టీ నాయకులు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, ప్రధాన కార్యదర్శులు ఆడెపు రమేశ్, అప్పాల జలేందర్ పాల్గొన్నారు.